క్లుప్తంగా

రీ-సర్వేను సద్వినియోగం చేసుకోవాలి



నరేంద్రపురంలో రీ-సర్వే పనులు పరిశీలిస్తున్న డీటీ పడాల్

మునగపాక: రీ-సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రీ-సర్వే డీటీ పడాల్ కోరారు. నరేంద్రపురంలో రీ-సర్వే పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. గతంలో రీ-సర్వేలో జరిగిన తప్పులను సవరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. రైతులు అందుబాటులో ఉండాలన్నారు. ఇకపై రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రీ-సర్వే ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్ సేవలందిస్తున్న అధికారులు

మునగపాక: ప్రతి ఒక్కరూ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. అధికారుల పర్యవేక్షణలో స్థానిక సచివాలయంలో ఆరేళ్ల లోపు పిల్లలకు ఆధార్ నమోదుతో పాటు బయోమెట్రిక్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఎంపీడీవో ఇక్కడ కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోటవురట్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. స్థానిక సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన సమావేశం జరుగుతుందని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని కోరారు.

'విడాకులు కావాలి' నాటిక ప్రదర్శన నేడు

మునగపాక: గౌతమపఠన మందిరం స్వర్ణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి విడాకులు కావాలి నాటిక ప్రదర్శించనున్నట్లు మందిర సభ్యులు తెలిపారు. స్థానిక సంతబయిల పఠన మందిరం సమీపంలోని స్టేజిపై రాత్రి 7 గంటలకు నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన అరవింద్ ఆర్ట్స్ వారిచే నిర్వహించే నాటికకు గంగోత్రిసాయి దర్శకత్వం వహిస్తారని, కళాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

చురుగ్గా డ్రైనేజీ నిర్మాణ పనులు



డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ వరహాలబాబు

కోటవురట్ల: నీలిగుంటలో డ్రైనేజీ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ పనులను సర్పంచ్ కన్నంరెడ్డి వరహాలబాబు శుక్రవారం పరిశీలించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని పలు వీధుల్లో డ్రైనేజీల నిర్మాణాలకు జెడ్పీటీసీ నిధులు 1.50 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. వీటితో పాటు పంచాయతీ నిధులు కలిపి నిర్మాణ పనులు చేపట్టినట్టు తెలిపారు. నిర్మాణం పూర్తయితే పారిశుద్ధ్య సమస్య పరిష్కారమవుతుందన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు.

రక్తదానంతో ఆరోగ్యం

అనకాపల్లి: యువకులు ఏడాదికి రెండు సార్లు రక్తదానం చేయడంతో ఆరోగ్యంగా జీవించవచ్చని జిల్లా డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ ప్రతినిధి పెతకంశెట్టి జోసెఫ్ అన్నారు. స్థానిక గ్రంధి కన్నయ్య మెమోరియల్ హాల్లో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదానం చేశారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు, అత్యవసర ఆపరేషన్ సమయంలో వారికి రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఏంటీ.. ఎందుకు.. పనిచేయడం లేదు?

ఏంటి.. ఏటీఎం పని చేయడం లేదా... ఎందుకు? ఇది యలమంచిలి పట్టణంలో ప్రతి బ్యాంకు ఖాతాదారు నుంచి వినిపిస్తున్న మాట. 24 గంటల పాటు ఖాతాదారులకు నగదు సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఏటీఎంలు సాంకేతిక లోపంతో తరచూ మొరాయిస్తున్నాయి. దాంతో విత్‌డ్రాల్స్, డిపాజిట్లకు ఖాతాదారుల అవస్థలు పడుతున్నారు. వీటి నిర్వహణ సక్రమంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



పట్టణంలో కిల్మి లాడ్జి వద్ద ఏటీఎం కేంద్రంలో క్యూఆర్ కోడ్‌తో నగదు ఉపసంహరణకు సాంకేతిక లోపం



ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం వద్ద ఏటీఎం కేంద్రంలో తరచూ మొరాయిస్తున్న ఏటీఎం మెషీన్



పట్టణంలో వ్యాన్ల స్టాండు వద్ద ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో పనిచేయని ఏసీలు

యలమంచిలిలో తరచూ మొరాయిస్తున్న ఏటీఎంలు
విత్‌డ్రాల్స్, డిపాజిట్లకు ఖాతాదారుల అవస్థలు
నిర్వహణ సక్రమంగా లేదని అసంతృప్తి

యలమంచిలి రూరల్: ప్రజలకు ఆర్థిక లావాదేవీలు సులభతరం చేసేందుకు 24 గంటలు బ్యాంకు సేవలు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసిన ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్(ఏటీఎం) కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. సాధారణంగా బ్యాంకుల్లోనే ఆర్థిక లావాదేవీలు జరగ్గా బ్యాంకు ఖాతాదారులకు ఇబ్బందులు తొలగించేలా ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. చెక్కులు, డిమాండ్ డ్రాఫ్టులు, బంగారు రుణాలు, బ్యాంకుల్లో ఉద్యోగులు చేయాల్సిన ముఖ్యమైన బ్యాంకింగ్ కార్యకలాపాలు మినహాయించి డిపాజిట్, విత్‌డ్రా వంటి సేవలు మెషీన్ల ద్వారా చేసుకోవాలని బ్యాంకు అధికారులు ప్రచారం చేస్తున్నారు. ఈ తరహా సేవలకు ఏటీఎం మెషీన్లతో పాటు డిపాజిట్ మెషీన్లు అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ ఏటీఎం కేంద్రాల్లో మెషీన్లు తరచూ మొరాయిస్తూ ఖాతాదారులకు సక్రమంగా సేవలందించడంలేదు. పట్టణంలో దేశంలో ఓ అతిపెద్ద జాతీయ బ్యాంకుకు సంబంధించిన ఏటీఎంలు ఐదు చోట్ల ఉన్నాయి. వాటిలో నాలుగు తరచుగా సాంకేతిక కారణాలతో మొరాయిస్తున్నాయి. అదేవిధంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు చెందిన ఏటీఎం మెషీన్లు మరో ఐదు వరకు ఉన్నాయి. ఇవన్నీ ఎప్పుడు పనిచేస్తాయో తెలియని పరిస్థితి నెలకొందని ఖాతాదారులు వాపోతున్నారు. బ్యాంకు ఆడిటర్లు వచ్చినప్పుడో లేక ఉన్నతాధికారుల తనిఖీల సమయంలో ఏటీఎంలలో సౌకర్యాలపై హడావుడి చేసే అధికారులు ఆ తర్వాత వాటిని విస్మరిస్తున్నారు.



పట్టణంలో అలంకారప్రాయంగా మారిన ఎస్‌బీఐ ఏటీఎం

అత్యవసరంలో అవస్థలే..

పట్టణంలో పదికి పైగా ఉన్న ఏటీఎం కేంద్రాల్లో అధికశాతం మెషీన్ల నుంచి నగదు తీసుకునే సౌకర్యం ఉంది. అయితే బ్యాంకు నిబంధనల మేరకు ఖాతాదారులకు 24 గంటలూ ఈ మెషీన్ల ద్వారా సేవలు అందించాలి. కానీ అత్యవసరంగా నగదు అవసరమైన పరిస్థితుల్లో యలమంచిలి పట్టణంలో ఏటీఎం మెషీన్ల నుంచి సాంకేతిక లోపాలతో నగదు తీసుకోవడానికి, జమ చేయడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో నగదు అత్యవసరమవుతున్న వారి అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ఏ ఒక్కరోజైనా ఖాతాదారుడు అసౌకర్యానికి గురైతే తక్షణమే అసౌకర్యాన్ని తొలగించి మెరుగైన సేవలు అందించాలి. కానీ యలమంచిలి పట్టణంలో ఆ పరిస్థితి ఉండడం లేదని పలువురు ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. డిజిటల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ వంటి సౌకర్యాలున్నా చాలామంది ఇప్పటికీ ఏటీఎం మెషీన్లు వాడుతున్నారు. ముఖ్యంగా పెన్షన్‌దారులు, యాభై ఏళ్ల పైబడినవారు ఏటీఎం మిషన్ ద్వారా నగదు తీసుకుందామని వస్తే, తీరా అవి పని చేయకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంచితే కొన్ని ఏటీఎం సెంటర్లలో కనీసం ఏసీలు పనిచేయడం లేదని ప్రజల నుంచి వినిపిస్తున్న వాదన, మరోపక్క ఆర్థిక లావాదేవీలకు వినియోగ చార్జీలు ముక్కుపిండి మరీ వసూలు చేసే బ్యాంకు అధికారులు ఖాతాదారులకు కలుగుతున్న అసౌకర్యంపై పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా పట్టణంలో ఉన్నటువంటి జాతీయ బ్యాంకుల ఏటీఎం సెంటర్లలో ఏర్పాటు చేసిన మెషీన్లు పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, బ్యాంకుల ఖాతాదారులు కోరుతున్నారు.



పట్టణంలో ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ప్రధాన రహదారి పక్కన సరిగా పని చేయని ఏటీఎం

అన్ని సమయాల్లో పనిచేసేలా చూడాలి



ఏటీఎం కేంద్రాలు ఎల్లవేళలా పనిచేసేలా చూడాల్సిన బాధ్యత బ్యాంకు అధికారులదే. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నగదు ఉపసంహరణ కోసం పట్టణంలోని బరోడా బ్యాంకు ఏటీఎం కేంద్రం వద్దకు వెళ్తే మూతబడి ఉంది. ఎందుకు మూసివేశారో తెలియజేసే సమాచారం గానీ, చెప్పేందుకు బ్యాంకు సిబ్బంది కానీ అక్కడ లేరు. ఇది చాలా అసౌకర్యం కలిగించింది. నాలాగే మరికొందరు కూడా ఈ కారణంతో ఇబ్బంది పడ్డారు. ఈ ఒక్క ఏటీఎం కాకుండా పట్టణంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలలో కొన్ని తరచుగా మొరాయిస్తున్నాయి.

– కటారి పద్మ, ప్రైవేట్ కళాశాల లెక్చరర్, యలమంచిలి

నిర్వహణ సక్రమంగా ఉండాలి



యలమంచిలి పట్టణానికి వివిధ పనులపై వస్తున్నప్పుడు నగదు తీసుకునేందుకు అత్యవసరంగా ఏటీఎం కేంద్రాలకు వెళితే చాలా సార్లు అవి పని చేయడం లేదు. 24 గంటల సేవలూ అందించాల్సిన ఈ కేంద్రాలపై నమ్మకంతో నగదు తీసుకోవచ్చులే అనే ధీమా ఉండడం లేదు. దీంతో నిత్యావసరాలు కొనుగోలు చేయడానికి ఒక్కోసారి చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఖాతాదారులకు మెరుగైన సేవలందించడానికి ఏటీఎం కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండేలా పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత బ్యాంకు అధికారులపై ఉంది.

– బాషా, రేగుపాలెం, యలమంచిలి మండలం

వృద్ధులకు ఎంతో ఇబ్బందిగా ఉంటోంది



వృద్ధులకు డిజిటల్, ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలపై అంతగా అవగాహన ఉండడంలేదు. బ్యాంకు ఖాతా నుంచి నగదు విత్‌డ్రా చేసుకోవాలంటే బ్యాంకుల్లో సిబ్బంది అనుమతించడం లేదు. నాకు ప్రతి నెలా ప్రభుత్వం నుంచి పింఛను సొమ్ము జమయ్యే ఖాతా విశాఖ నగర పరిధిలో ఉంది. నేను యలమంచిలిలో నివాసం ఉంటున్నాను. ఈ కారణంగా నగదు తీసుకోవడానికి ఏటీఎం కేంద్రాలకు ఎంతో కష్టపడి వెళ్తే, అక్కడ అవి సక్రమంగా పనిచేయడం లేదు. దీనికితోడు ఏటీఎం కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఉండడం లేదు. చాలా ఏటీఎం కేంద్రాల్లో ఏసీలు పనిచేయడం లేదు. దీంతో కేంద్రాల తలుపులు తీసి ఉంచాల్సిన పరిస్థితి ఉంటోంది. డెబిట్ కార్డు ద్వారా లావాదేవీ నిర్వహించడానికి ఏటీఎం కేంద్రంలోకి వెళ్తున్నప్పుడు అందరూ లోపలకు వచ్చేస్తున్నారు.

– పి. రంగసాయి, విశ్రాంత ఉపాధ్యాయుడు, గాంధీనగరం, యలమంచిలి

పూడిమడకలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

అచ్యుతాపురం: మత్స్యకార గ్రామమైన పూడిమడకలో చెత్త తొలగింపు పనులు శుక్రవారం చేపట్టారు. సర్పంచ్ చేపల సుభాషిణి పర్యవేక్షణలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని పారిశుధ్య కార్మికులు నిర్వహించారు. సముద్ర తీర ప్రాంతమైన పూడిమడకలో ఇటీవల ప్లాస్టిక్ భూతం పంజా విసురుతోంది. ఒకవైపు తంతడి బీచ్‌లో ఇటీవల క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టగా, ఇటు పూడిమడకలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పనులు ఎంత వరకూ సాగుతాయి..? గ్రామమంతా ఉన్న చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎంత వరకూ తొలగిస్తారో చూడాల్సి ఉంది.



పూడిమడకలో ప్లాస్టిక్‌తో కూడిన చెత్తను పొక్లెయిన్ సాయంతో తొలగిస్తున్న దృశ్యం

రహదారి భద్రత పాటించండి..



కోటవురట్లలో మానవహారంగా ఏర్పడిన వెలుగు సిబ్బంది

కోటవురట్ల: రహదారి భద్రత పాటించండి.. క్షేమంగా ఇంటికి వెళ్లండంటూ గ్రామైక్య సంఘాల సభ్యులు నినదించారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్త్రీ శక్తి భవనం నుంచి గ్రామైక్య సంఘాల సభ్యులు ర్యాలీ చేసి ప్రధాన కూడలిలో మానవహారం సృష్టించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, అతివేగం ప్రాణాలను హరిస్తుందని నినాదాలు చేశారు. ఇన్‌చార్జ్ ఏపీఎం శివప్రసాద్, సీసీ వల్లీ, భవానీ, సత్యవని, సరోజిని, వీవోఏలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు ఉల్లంఘించొద్దు

ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ

యలమంచిలి రూరల్: ఆటో డ్రైవర్లంతా రహదారి నిబంధనలు తప్పకుండా పాటించాలని ట్రాఫిక్ ఎస్సై బి రామకృష్ణ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని కోర్టుపేట భాష్యం స్కూల్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. పరిమితికి మించి ప్రయాణికులను, విద్యార్థులను ఆటోల్లో ఎక్కించకూడదన్నారు. అందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, నిబంధనలు అతిక్రమించరాదన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ముఖ్యంగా మత్తుపానీయాలు, పదార్థాలు సేవించి వాహనాలను నడపరాదన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామకృష్ణ

ధరలు తగ్గించాలని సంతకాల సేకరణ



సంతకాల సేకరణ చేపడుతున్న దృశ్యం

అచ్యుతాపురం: నిత్యావసర ధరలు తగ్గించాలని కోరుతూ శుక్రవారం స్థానిక జంక్షన్‌లో ఐద్వా ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. రేషన్ డిపోల ద్వారా 16 నిత్యావసర వస్తువులను తక్కువ ధరకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మి, మండల కార్యదర్శి లక్ష్మి, మంగమ్మ, కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలకు విశేష స్పందన



ముగ్గులు వేస్తున్న బాలికలు

మునగపాక: గౌతమ పఠన మందిరం స్వర్ణోత్సవాల్లో భాగంగా మునగపాకలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన వచ్చింది. సంతబయిల పఠన మందిరం ఆవరణలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో బాలికలు, మహిళలు పాల్గొన్నారు. ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. విజేతలకు 26వ తేదీన బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

రాయితీపై లింగ నిర్ధారణ వీర్యం

కోటవురట్ల: పశువుల లింగ నిర్ధారణ వీర్యంతో మంచి ఫలితాలు వస్తున్నాయని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెట్ల నరేష్ తెలిపారు. మండలంలోని బి.కె.పల్లి, రాజుపేట గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను శుక్రవారం నిర్వహించారు. బి.కె.పల్లిలో ఏడీ నరేష్ శిబిరాన్ని ప్రారంభించి పశు సంవర్ధక శాఖ అందిస్తున్న రాయితీలను వివరించారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డు, పశు గ్రాస క్షేత్రాల గురించి వివరించారు. అనంతరం దొడ్ల డెయిరీ సహకారంతో పాడి రైతులకు మినరల్ మిక్చర్‌ను అందించారు. ఏడీ మాట్లాడుతూ లింగ నిర్ధారణ వీర్యాన్ని పశు సంవర్ధక శాఖ రాయితీపై అందిస్తోందన్నారు. ఈ శిబిరంలో 42 పశువులకు గర్భకోశ చికిత్సలు, 220 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టరు హరిప్రియ, సర్పంచ్ లింగన్నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు. రాజుపేటలో డాక్టరు ప్రతాప్‌కుమార్, సర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు.



బి.కె.పల్లిలో గొర్రెలకు నట్టల నివారణ టీకా వేస్తున్న ఏడీ నరేష్

మంచు కురిసే వేళలో

కుమ్మేసిన పొగ మంచు



హరిపాలెం-కొండకర్ల మధ్య వాహనాలు కనిపించని దృశ్యం (దట్టంగా అలుముకున్న పొగమంచు)

అచ్యుతాపురం: శీతాకాల తీవ్రత ఇంకా కొనసాగుతోంది. సాధారణంగా భోగి తర్వాత మంచు తాకిడి తగ్గుతుంది. శివరాత్రికి పూర్తిగా శీతాకాల ప్రభావం మాయవుతుంది. అయితే శుక్రవారం మండల పరిధిలో పొగమంచు తీవ్రంగా కనిపించింది. రాత్రి నుంచి కురుస్తున్న మంచుకు తోడు తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకూ మంచు ప్రభావంతో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించలేదు. వ్యవసాయ క్షేత్రాల్లో సుందర దృశ్యాలు ఆవిష్కారమవ్వగా, చిన్నారులు, వృద్ధులు కాస్త ఇబ్బందికి గురయ్యారు.



మునగపాకను కమ్మేసిన పొగమంచు

మునగపాక: మండల వ్యాప్తంగా పొగమంచు ఒక్కసారిగా పెరిగిపోయింది. ఉదయం 8 గంటలు కావస్తున్నా మంచు తెరలు వీడటం లేదు. వర్షంలా మంచు కురవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారులపై లైట్లు వేసుకుని మరీ ప్రయాణం సాగించాల్సి వస్తోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక అవస్థలు తప్పలేదు. ప్రతి ఒక్కరూ తాము ఏజెన్సీలో ఉన్నామా అన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం వన సమారాధన రేపు

అనకాపల్లి: చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం వనసమారాధన కార్యక్రమం ఈ నెల 26 మండలంలో శంకరం పంచాయతీ బొజ్జన్న కొండ వద్ద నిర్వహిస్తున్నట్లు సంఘం గౌరవాధ్యక్షుడు ముప్పన సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక మెయిన్‌రోడ్డు సంఘం కార్యాలయంలో శుక్రవారం వనసమారాధన కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎంఆర్ షాపింగ్‌మాల్ అధినేత మావూరి వెంకటరమణ, చలన చిత్ర దర్శకుడు నక్కిన త్రినాథ్‌రావు, విశాఖ దేవాంగ సంఘం అధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణ విచ్చేయుచున్నట్లు చెప్పారు. సంఘం పరిధిలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న దంపతులను శాలువాలతో సత్కరిస్తామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.



వనసమారాధన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ముప్పన సుబ్రహ్మణ్యం

27 నుంచి కలెక్టరేట్ వద్ద వీవోఏల నిరసనలు

అనకాపల్లి: వెలుగు వీవోఏలకు బకాయిపడ్డ ఆరు మాసాల జీతాలు కూటమి ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకూ కలెక్టర్ కార్యాలయం వద్ద సామూహిక నిరాహార దీక్షలు చేస్తామని ఏపీ వెలుగు వీవోఏల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్.రూపాదేవి తెలిపారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉపాధికి భద్రత కల్పిస్తూ 3 సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, బకాయిపడ్డ కార్మికుల జీతాలు చెల్లించాలని కోరారు. సంక్రాంతి పండగకు జీతాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ నెల 31వ తేదీలోపు సమస్యలు పరిష్కరించకపోతే ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి పనులను నిలుపుదల చేస్తామన్నారు.